# భిన్నత్వాన్ని విశ్వసించినవారు దైవత్వాన్ని పొందలేరు

**సద్భక్తులందరు చేరి భగవంతుడాయంచు**
**చెవులకింపుగ నుతి చేయు దినము**
**బీదల వెతలన్ని ప్రీతితో తొలగించి**
**అన్నదమ్ముల మాడ్కి నున్న దినము**
**దైవచింతన చేయు దాస బృందములకు**
**ప్రీతి మృష్టాన్నము పెట్టు దినము**
**మహనీయుడెవరైన మనకడ కేతెంచి**
**చేరి దేవుని గూర్చి చెప్పు దినము**
**అట్టి దినమును దినముగా అనుభవించు**
**తక్కిన దినములన్నియు తద్దినములె**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపఱతు?**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!**

ప్రేమస్వరూపులారా!

మీరు ఈ సాధనా శిబిరంలో పాల్గొనాలని ఎంతో ఉత్సాహంతో ఇక్కడికి వచ్చారు. మీరు ఇక్కడ ఉన్నది కొద్దికాలమే అయినప్పటికీ మీ అనుభవాలు చాలా గొప్పవిగా వున్నాయి. వాటిని మీరు మీ ప్రసంగాలలో గొప్పగా వర్ణించారు. అయితే, మీరు ఆశించిన ఫలము ఇంకా మీకు దక్కవలసి యున్నది. ఏదో కొంచెం భుజించి ఇంతటితో కడుపు నిండిందని తృప్తి పడకండి. మీ కడుపు నిండుటకు ఇంకా మీరు ఎంతో భుజించాలి. మున్ముందు మీరు ఎంతైనా ఆనందమును అనుభవించడానికి అవకాశ మున్నది.

srisathyasaivachanamrutam

ఈ శిబిరంలో యువతయొక్క కార్యక్రమాలను గురించి, కర్తవ్యాలను గురించి మీరు చర్చించడం జరిగింది. ముఖ్యంగా, మీరు మీ జీవితాన్ని ప్రేమమయం గావించుకోవాలి. కాని, ప్రేమ అంటే ఏమిటో ఈనాటి యువతీ యువకులకు అర్థం కావడం లేదు.

**ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము**
**ప్రేమ ప్రేమతొ సంధింప నీమమగును**
**కాన, ప్రేమను గట్టిగా పట్టియున్న**
**అద్వితీయము నొందంగ అర్హుడగును**

ఏకాత్మప్రేమయే నిజమైన ప్రేమ. హృదయములు వేరువేరుగా ఉన్నట్లయితే, అది ప్రేమ కాదు. ఒకరు ఇవ్వడం, మరొకరు పుచ్చుకోవడం ... ఇట్టి భావముతో కూడినది ప్రేమ కాదు. సర్వకాల సర్వావస్థలయందు ఇచ్చుకోవడమే నిజమైన ప్రేమతత్త్వం. కష్టసమయంలో వెనుకంజ వేయడం స్వార్థప్రేమ అనిపించుకుంటుంది. మీరు స్వార్థమును త్యజించి, పరార్థమును వరించి యథార్థ ప్రేమలో ప్రవేశించాలి.

పదార్థమునకు, యథార్థమునకు ఎంత భేదము వున్నదో మీరు గుర్తించాలి. 'మేటర్' (Matter)తో కూడినటువంటిది పదార్థము. 'మేటర్'కు అతీతమైనది యథార్థము. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే సత్యాన్ని మొట్టమొదట తెలుసుకోవాలి. 'సుఖ దుఃఖే సమేకృత్వా లాభా లాభౌ జయా జయౌ' అన్నట్లు సుఖదుఃఖములయందు, లాభనష్టములయందు మీరు సమత్వమును వహించాలి. మనస్సుతో కూడినప్పుడు కేవలం 'మేటర్' మాత్రమే మీకు గోచరిస్తుంది. 'మేటర్'కు, మీకు ఎట్టి సంబంధమూ ఉండకూడదు. కాబట్టి, మనస్సుతో మీరు సంబంధమును పెట్టుకోకూడదు. మనస్సు చేరినచోట భిన్నత్వమే ఏర్పడుతుందిగాని, ఏకత్వము గోచరించదు.

### ఏకత్వాన్ని గుర్తించి వర్తించడం భక్తుల కర్తవ్యం

ద్వైతముతోను, భిన్నత్వంతోను కూడినటువంటిది భక్తి కానేరదు. ఏకత్వముతో కూడినదే భక్తి. భక్తిలో రెండు విధములైన భావములు ఉండకూడదు. మీయందు వున్నది, పరులయందున్నది ఒక్క ప్రేమతత్త్వమే. అట్టి ప్రేమతత్త్వాన్ని, ఏకత్వాన్ని గుర్తించి

sri sathyasai vachanamrutam

వర్తించడమే భక్తులయొక్క ప్రధాన కర్తవ్యము. మనం ప్రేమకోసం ప్రేమను అందించాలి. ఈనాడు జగత్తులో ప్రతి ఒక్కరు లౌకికమైన ప్రేమను అనుభవిస్తున్నారు. భిన్నత్వముతో కూడిన ప్రేమనే నిజమైన ప్రేమగా భావించి దానిని అనుసరిస్తూ పోతున్నారు. కాని, అది 'ప్రేమ' అనిపించుకోదు. ప్రేమకు ఒక్కటే మార్గము, ఒక్కటే గమ్యము. ప్రేమయే దైవము, దైవమే ప్రేమ. Live in love. ప్రేమను ఎవరైతే హృదయంలో నింపుకొందురో వారే సార్థకతను పొందగలరు. "ప్రేమ ముదిత మనసె కహో రామ రామ రామ్..." ఏ పేరును స్మరించినా ప్రేమతో స్మరించాలి. ఇట్టి పవిత్రమైన, సార్థకమైన, ఏకత్వంతోకూడిన ప్రేమతత్త్వాన్ని మీరు అనేకత్వంగా విభజించుకొని దానిని అనుసరిస్తూ వెళుతున్నారు.

**ప్రేమకు, దేహానికి ఎట్టి సంబంధమూ ఉండకూడదు**

కష్టసుఖములయందు ప్రేమ ఏకంగానే ఉండాలి. దీనిలో ఎట్టి భేదములూ ఆవిర్భవించకూడదు. నిజమైన భక్తియందు ఎట్టి భేదములూ కానరావు. I and you are one. 'నీవు, నేను' అనే భేదముండకూడదు. 'నీవు' అనేది 'సెకెండ్ పర్సన్'కు సంబంధించినది. 'నేను' అనేది ఏకాత్మతత్త్వము. 'నీవు, నేను' అనే భేదమును దూరం చేసి పవిత్రతను, దివ్యత్వాన్ని అనుసరించాలి. ఇట్టి ఏకత్వాన్ని ప్రేమతత్త్వముద్వారా అనుభవించ వలసిందేగాని, బోధించుటకు సాధ్యం కాదు. ప్రేమ అంటే మీరు లౌకికమైన అర్థాలు తీసుకుంటున్నారు. దానికి అనేక మార్పులు చేసుకుంటున్నారు. ప్రేమకు, దేహానికి ఎట్టి సంబంధమూ ఉండకూడదు.

దేహము 'మేటర్'తో కూడినది. 'మేటర్'కు సంబంధించిన ప్రేమ మనకు నిజమైన శాంతిని అందించదు. కనుక, మనం 'మేటర్'తో ఏమాత్రం సంబంధము పెట్టుకోకుండా ఏకాత్మభావమును అలవరచుకోవాలి. మీ ప్రేమను మీరు ప్రాకృతమైన మార్గంలో తీసికొనిపోతున్నారు. అదే మీరు చేస్తున్న పెద్ద పొరపాటు. ప్రేమతత్త్వంలో ద్వైతభావము ఏమాత్రం చేరకూడదు.

srisathyasaivachanamrutam

**ఏకాత్మభావంతో మీరు దైవత్వాన్ని అనుభవించాలి**

మీరు బాహ్యదృష్టికి వేర్వేరుగా కనిపించినప్పటికీ మీ అందరిలో ఉన్నది ఒకే ఆత్మయే! అందుకోసమే నేను మిమ్మల్ని 'ప్రేమాత్మస్వరూపులారా!' అని పిలుస్తున్నాను. ప్రేమతత్త్వం ఏకత్వంతో కూడినదేగాని, అనేకత్వంతో కూడినది కాదు. ఇట్టి ప్రేమయే నిజమైన భక్తి క్రింద చేరుతుంది. జయదేవుడు, గౌరాంగుడు, ఏకనాథుడు వీరందరూ తమ ప్రేమతత్త్వాన్ని దైవముపై ఏకంగా ప్రసరింపజేశారు. సక్కుబాయి, మీరా మొదలైన సాధ్వీమణులందరూ తమ ప్రేమను ఒకే మార్గములో ప్రవేశపెట్టారు. 'రామా', 'కృష్ణా', 'ఈశ్వరా', అంటూ వేరువేరు పేర్లతో వాళ్ళు దైవత్వాన్ని భిన్నత్వంగా అనుభవించలేదు. భిన్నత్వాన్ని విశ్వసించినవారు దైవత్వాన్ని పొందలేరు. ఏకాత్మభావముతో దైవత్వాన్ని అనుభవించాలి. 'రామా' అనండి, లేక 'కృష్ణా' అనండి, లేక 'ఈశ్వరా' అనండి. ఏ పేరు పెట్టి పిలిచినా దైవత్వం ఒక్కటేనని, గమ్యం ఒక్కటేనని మరువకండి. ఒక పర్యాయం కృష్ణుడు రాధకు కనిపించకుండా ఎటో వెళ్ళేసరికి ఆమె కృష్ణునికోసం అనేక విధాలుగా పరితపించింది; అనేకచోట్ల అన్వేషిస్తూ వచ్చింది. అయితే, భగవంతుని రూపము, నామము రెండూ ఒక్కటేగాని, వేరువేరు కావు. కాని, ఈనాటి మానవునికి అంత లోతునకు పోయే శక్తి, సామర్థ్యములు లేవు.

ప్రేమతత్త్వం చాలా శక్తిమంతమైనది. దీనికున్న శక్తి మరి దేనికికూడను లేదు, రాదు. ఈ ప్రేమశక్తి పరిశోధనలకు చిక్కేది కాదు, దక్కేది కాదు. ఒక్క ప్రేమమార్గంలో తప్ప అన్యమార్గంలో దీనిని అర్థం చేసుకోవడానికి వీలుకాదు. మీరా మహాభక్తురాలు. ఆమె నిరంతరం కృష్ణమందిరంలో కూర్చుని భజన కీర్తనలు పాడుతూ ఉండేది. అది మహారాణాకు నచ్చలేదు. "ఇది నేను కట్టించిన మందిరం. ఇందులో నీవు కూర్చోవడానికి వీల్లేదు. బయటికి పొమ్మ"ని ఆమెను ఆదేశించాడు. అది మీరాకు 'షాక్' మాదిరి తగిలింది. "ఏమిటి? నన్ను బయటికి పొమ్మంటున్నాడే! ఎక్కడికి పోయేది? కృష్ణుడున్నది ఎక్కడ? లోపలనా? లేక బయటనా? ఎక్కడ చూసినా ఉన్న కృష్ణుణ్ని వదలిపెట్టి నేను 'బయటికి' ఎలా వెళ్ళగలను!" అని విచారణ సల్పి, వెంటనే తాను మధురకు బయలుదేరింది. ఇక్కడ మధుర

srisathyasaivachanamrutam

అనగా ఒక పట్టణం కాదు. మధురమైనటువంటి హృదయమే మధుర.

'చలోరే మన్.... గంగా యమునా తీర్

గంగా యమునా నిర్మల్ పానీ

శీతల్ హోత శరీర్... చలోరే మన్ .... గంగా యమునా తీర్' కృష్ణనామస్మరణ చేసుకుంటూ మీరా బయలుదేరింది. కొండలు, గుట్టలు, రాళ్ళు, రప్పలు, అడవులు అన్నిటినీ దాటుకుంటూ వెళ్ళి బృందావనం చేరుకుంది. కాని, అక్కడికి వెళ్ళేసరికి మందిరం తలుపులు మూసుకొని వున్నాయి. ఎంత ప్రార్థించినప్పటికీ ఆ తలుపులు తెరుచుకోలేదు. అప్పుడు మీరా, "కృష్ణా! నీవు నా హృదయవాసివి. నాకున్నది ఒకే హృదయము. ఆ హృదయాన్ని నీకు అర్పిస్తున్నాను. అందుకో" అని గట్టిగా ప్రార్థించి ఆ మందిర ద్వారానికి తన తలను కొట్టింది. తక్షణమే కృష్ణుడు ప్రత్యక్షమై ఆమెను తనలో లీనం చేసుకున్నాడు. మీరాను కృష్ణమందిరంనుండి బయటికి గెంటేసినందుకు మహారాణా పశ్చాత్తాపపడి, తనను క్షమించ వలసిందిగా కృష్ణుని ప్రార్థించాడు.

**భగవంతుడు మీకంటే భిన్నంగా లేడు**

గంగాయమునా తీరమనగా ఇడ, పింగళ నాడులు కలుసుకొనే భ్రూమధ్యస్థానము. దానినే 'మధుర'గా భావించింది మీరా. కృష్ణుడు తన హృదయవాసి అని విశ్వసించింది. ఇలాంటి అంతరార్థములను ఈనాడు ఎవ్వరూ గుర్తించడం లేదు. బాహ్యమైనటువంటి అర్థములనే విశ్వసిస్తూ, భౌతికమైన మార్గమునే అనుసరిస్తూ కాలం గడుపుతూ వస్తున్నారు. మనం ప్రాపంచికమైన, భౌతికమైన అర్థములను తీసుకోకూడదు. హృదయస్థాయి యందున్న భావమునే మనం ఆధారం చేసుకోవాలి. అదియే శాశ్వతమైనది, అదియే సత్యమైనది. అది కదిలేది కాదు, మెదిలేది కాదు. హృదయస్థాయి అయినటువంటి దివ్యత్వము ఏనాటికీ మార్పు చెందదు. అట్టి మార్పు చెందని తత్త్వాన్ని అనుసరించడంచేతనే మీరా తనకు అత్యంత ప్రియ మైనటువంటి, తన ప్రాణసమానమైనటువంటి కృష్ణుణ్ణి పొందగలిగింది. ప్రేమతత్త్వమును మించినటువంటిది మరొకటి లేదు. అది ఏకాత్మ తత్త్వముతో కూడినటువంటిది. కాబట్టి, భక్తులు కాగోరునటువంటివారు ప్రేమతత్త్వాన్ని

sri sathyasai vachanamrutam

గట్టిగా పట్టుకోవాలి. సామాన్యమైన ప్రజలు తమ ప్రేమను మార్చుకుంటూ ఉంటారుగాని, అచంచలమైన భక్తి, విశ్వాసములు కలిగినవారు ఏమాత్రం మార్చుకోరు. ప్రేమమార్గం తప్ప అన్య మార్గములేవీ మనలను భగవంతునిదగ్గరకు చేర్చలేవు. కనుక, ప్రేమను పెంచుకోండి.

ప్రేమస్వరూపులారా! మీరు మీమీ స్వస్థలాలకు తిరిగి వెళ్లిన తరువాత కూడా ప్రేమను ఏమాత్రము మరువకండి. ప్రేమనే మీ హృదయంగా భావించుకోండి. ఇంక దేనికీ చింతించనక్కర్లేదు. భగవంతుడు మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉంటుంటాడు. "కృష్ణా! నేను నిన్ను అనుసరిస్తాను", అని ప్రార్థిస్తే కృష్ణుడు ముందు, మీరు వెనుక నడుస్తుంటారు. అప్పుడు మీరు వేరు, కృష్ణుడు వేరు. అట్లుగాకుండా, "కృష్ణా! నీవు నిరంతరం నావెంట ఉండు", అని ప్రార్థించాలి. నిజంగా, కృష్ణుడు మీ వెంటనే ఉన్నాడు, మీయందే ఉన్నాడు. చాలామంది భక్తులు, 'స్వామీ, I am with You, I am in You, I am for You' అని అంటుంటారు. ఇవన్నీ కేవలం యాంత్రికంగా ఉచ్చరించే పదములే తప్ప హృదయపూర్వకంగా చెప్పేవి కావు. భగవంతుడు ఎప్పటికీ మీతో ఏకంగానే ఉన్నాడుగాని, మీకంటే భిన్నంగా లేడు. కనుక, మీరు ఎప్పుడుకూడను మీ దేవుడు మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉంటున్నాడని భావించుకొని ప్రార్థించండి. ఈవిధంగా ప్రార్థించడంద్వారా మీరు ఎంతైనా ధన్యులు కాగలరు.

**– కేరళ యువత సాధనా శిబిరము ముగింపు సందర్భంగా శ్రీవారి దివ్యబోధ, తేదీ 13.04.2005 సాయికుల్వంత్ హాలు**

sri sathyasai vachanamrutam